సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 10, మార్చి, 2023



'పెద్దల' ఎన్నికకు..
ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిబ్బందిని కూడా కేటాయించారు.
- 8లో



రోడ్డు ప్రమాదంలో..
రోడ్డు ప్రమాదంలో ఓ ఉల్లి వ్యాపారి మృతి చెందారు. ఢీ కొట్టిన లారీ ఆపకుండా వెళ్లిపోయింది.
- 8లో

టెక్కలి నుంచి విశాఖకు త్రీ స్టాప్ సర్వీస్‌లు
టెక్కలి రూరల్: ప్రయాణికుల కోరిక మేరకు టెక్కలి నుంచి విశాఖకు రెండు త్రీ స్టాప్ సర్వీసులను గురువారం నుంచి నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సర్వీస్‌లు ఉదయం 8 గంటలకు, 9 గంటలకు టెక్కలి నుంచి బయల్దేరుతాయని, ఈ బస్సులు కొత్తపేట, నరసన్నపేట, శ్రీకాకుళం మీదుగా విశాఖ చేరుతాయని తెలిపారు. కొత్త బస్సులు వస్తే మరో రెండు త్రీస్టాప్ బస్సులు నడుపుతామని తెలిపారు.

న్యూస్‌రీల్

సమాజంలో స్త్రీల పాత్ర కీలకం



ఆర్టీసీ మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో మహిళల పాత్ర అనిర్వచనీయమైనదని రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అమృతకుమారి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో గల సమావేశ మందిరంలో గురువారం ఆర్టీసీ పర్సనల్ అధికారి కృష్ణవేణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అమృత కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ అంటే ప్రజలతో నిత్యం మమేకమైన సంస్థ అని అన్నారు. ఇందులో మహిళలు ఇటు కండక్టర్లుగా, అటు గృహిణులుగా తమ బాధ్యతను సమర్థంగా, సక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం జిల్లాలోని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్) గట్టు త్రిలోకవజ్రం, శ్రీకాకుళం ఒకటో డిపోకు చెందిన కండక్టర్ జి.సత్తమ్మ, శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన కండక్టర్ కె.శాంతమ్మ, పలాస డిపోకు చెందిన కండక్టర్ బి.ఎస్.రాణి, టెక్కలి డిపోకు చెందిన కండక్టర్ ఎస్.విజయలక్ష్మిలను సత్కరించి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

'బాలలు బడిలోనే ఉండాలి'



విద్యార్థులకు సూచనలందిస్తున్న ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ వెంకటరావు

శ్రీకాకుళం క్రైమ్ : బాలలు బడిలోనే ఉండాలని, బయట పనుల్లో చేరకూడదని ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ లండ వెంకటరావు పేర్కొన్నారు. ఆయన గురువారం శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో బాలల హక్కులు-పరిరక్షణ, బాల కార్మికుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలలను పనుల్లో పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎల్‌పీ జాతీయ బాలకార్మిక నిరోధక శాఖ ప్రోగ్రాం మేనేజర్ పెంకి బాలకృష్ణ, ఏహెచ్‌టీయు ఏఎస్‌ఐ రమణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్ 2.0లో 363 గ్రామాలు పూర్తి




వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సర్వే అండ్ సెటిల్ మెంట్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్‌కు వివరించారు. రెండో విడత రీ సర్వేపై సర్వే అండ్ సెటిల్ మెంట్స్ కమిషనర్ కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెబ్ ల్యాండ్ 2.0 ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ జిల్లాలో 363 గ్రామాలు పూర్తి చేశామని, మరో 106 ప్రాంతాల్లో సర్వే చేస్తున్నామన్నారు. వాటిని కూడా పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, భూ సర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకర రావు, డి-సెక్షన్ పర్యవేక్షకులు సూర్యనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంస్థల పరిరక్షణకు కృషి
శ్రీకాకుళం కల్చరల్: క్రైస్తవ సంస్థల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ సంఘం చైర్మన్ ప్రతాప్ సింహ కోరారు. స్థానిక క్రిస్టియన్ వర్షిప్ సెంటర్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు, సంఘ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే సీఎంకు ఈ విషయమై విన్నవించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్, పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ నాయకులు సీనియర్ సిటిజెన్స్ ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరణం

నింగినీ నేలను కలుపుతూ ఓ బంగారు వంతెన నాలుగు నిమిషాల పాటు ప్రజ్వరిల్లింది. ఎవరో గగన వీధి నుంచి గురి చూసి పంపినట్టు ఆకాశదారుల గుండా పయనించిన కిరణమొకటి అరసవల్లి గోపురంపై వాలి.. పక్కచూపులు లేకుండా నేరుగా అరుణ శిల పాదాలను తాకింది. చుట్టుపక్కలకు వెలుగు రేఖలు విస్తరించేలోపుగా.. ఆ కిరణం ఆదిత్యుడి ఆపాదమస్తకాన్ని అభిషేకించి కాలమార్పు జరిగిందని ప్రకటించింది. అరసవల్లి ఆలయంలో గురువారం ఆవిష్కృతమైన ఈ అపురూప స్వర్ణ కిరణ స్పర్శ విన్యాసం భక్తులను తన్మయత్వానికి గురి చేసింది.



- నాలుగు నిమిషాల పాటు ఆదిత్యుని మూలవిరాట్టును తాకిన కిరణాలు
- తిలకించి పులకించిన భక్తులు
- నేడు కూడా కిరణ దర్శనానికి అవకాశం

అరసవల్లి: ఆదిత్యుని క్షేత్రంలో ఉదయం 6.22 నుంచి 6.26 వరకు తొలి సూర్యకిరణాలు నేరుగా స్వామిని అభిషేకించిన దృశ్యాలను చూసి భక్తకోటి మైమరచిపోయింది. ఏటా ఉత్తరాయణ, దక్షిణాయన కాలమార్పుల్లో ఇలాంటి అద్భుత దృశ్యాలు కనిపిస్తుంటాయి. కిరణ స్పర్శ దర్శనం కోసం వేకువజామున 4 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. సరిగ్గా సూర్యోదయ సమయాన లేలేత కిరణాలు రాజగోపురం మధ్యలోంచి అనివెట్టి మండపం, ధ్వజస్తంభాన్ని తాకుతూ నేరుగా గర్భాలయంలోని స్వామి వారి మూలవిరాట్టును తాకాయి. దీంతో గంటల కొద్దీ వేచి ఉన్న భక్తులు ఆనందంతో పరవశించిపోయారు. కిరణాదిత్యుడిని చూసి తరించిపోయారు. ఈ సారి కిరణ దర్శనానికి వీలుగా కొత్తగా జింక్ బారికేడ్లను ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఏర్పాటు చేశారు. దీంతో దాదాపుగా క్యూలైన్లలో చేరిన వారందరికీ కిరణ దర్శనప్రాప్తి జరిగింది. భక్తుల గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శుక్రవారం ఉదయం కూడా కిరణ దర్శనానికి అవకాశం ఉందని శంకరశర్మ తెలిపారు.



ఇదే తొలిసారి..
సూర్యనారాయణ స్వామిపై కిరణాలు పడతాయని విన్నాను. ఇప్పుడు తొలిసారిగా చూశాను. ఊహించుకుంటుంటే మిరాకిల్‌లా ఉంది. ఎక్కడో ఉదయించిన కిరణాలు గర్భాలయంలోకి స్వామి పాదాలను తాకడం అద్భుతమనే చెప్పాలి. ఇలాంటి దృశ్యాన్ని అంతరాలయం నుంచి దగ్గరగా చూడడం నా అదృష్టం. మాటల్లో చెప్పలేని అనుభూతి ఇది.
– కె.సుజాత, కొవ్వూరు, పశ్చిమ గోదావరి జిల్లా



అరుణశిలను తాకిన సూర్య కిరణం

నిజంగా అత్యద్భుతమే...
హైదరాబాద్ నుంచి ఈ అద్భుతాన్ని చూడడానికి వచ్చాను. ముందు రోజునే చేరుకుని ఇక్కడే బస చేశాను. తొలిసారిగా కిరణ దర్శనాన్ని కుటుంబసమేతంగా చేసుకున్నాను. నిజంగా స్వామి కరుణించాడు. అద్భుత దర్శనం..అరుదైన అవకాశం కలిగింది. మళ్లీ మళ్లీ చూడాలని ఉంది.
– సీహెచ్ సత్యనారాయణ, హైదరాబాద్.



ఏటా వస్తాం
మేము ఫ్యామిలీ ఫ్రెండ్స్. ఏటా అరసవల్లి కిరణ దర్శనాలకు వస్తుంటాం. ఇప్పటికి నాలుగైదేళ్లుగా మేము ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తున్నాం. నిజంగా సూర్యభగవానుడు మాపై కరుణ ఉంచి అద్భుత దర్శనాన్ని ఇస్తున్నాడు. నిజంగా ఇక్కడి ప్రజలు ఎంతో అదృష్టవంతులు.
– డి.కోటేశ్వరరావు(విజయవాడ), ఎ.మునికృష్ణ (తిరుపతి), బి. సత్యత్రివేణి (బిక్కవోలు)



ఇల్లు.. ఇటుక.. ఉపాధి

- జిల్లాలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- అందుకు తగ్గట్టుగా ఇటుక బట్టీల ఏర్పాటు
- వేల మంది కూలీలకు ఉపాధి
- జిల్లాలో 250కిపైగా ఇటుక పరిశ్రమలు

వజ్రపుకొత్తూరు: పల్లె పొలిమేరల్లో కొత్త ఊళ్లు పురుడు పోసుకుంటున్నాయి. ఉన్న ఊళ్లలో ఇళ్లకు జతగా నూతన వాడల్లోనూ గృహ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఈ సందడి కొత్త ఉపాధి మార్గాలు చూపెడుతోంది. అందులో ఒకటి ఇటుకల పరిశ్రమ. ప్రైవేటు గృహాలతో పాటు జగనన్న కాలనీల పనులు కూడా జోరందుకోవడంతో ఇటుకలకు భారీ డిమాండ్ ఏర్పడింది. అందుకు తగ్గట్టుగానే జిల్లాలో కొత్తగా ఇటుకల బట్టీలు పుట్టుకువస్తున్నాయి. ప్రస్తుతం ఇటుకల పరిశ్రమ సీజన్‌లో జిల్లాలో 75 కోట్ల ఇటుకలను ఉత్పత్తి చేస్తోంది. రూ.450 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతున్న ఈ పరిశ్రమ వ్యాపారులకే కాకుండా దాదాపు 17,500 మందికి బతుకునిస్తోంది.

బట్టీల తయారీ ఇలా..
జిల్లాలో ఇటుకల తయారీ జోరుగా సాగుతోంది. జిల్లా నుంచే కాకుండా ఒడిశా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వచ్చిన వారు ఇక్కడ కూలి పనులు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని వజ్రపుకొత్తూరు, పలాస, నందిగాం, సోంపేట, ఇచ్ఛాపురం, గార, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో బెండిగేటు, పద్మనాభపురం, చెరుకుపల్లి, పీపీపురం, ఈదుపురం రోడ్డు, పాలవలస గేటు, తండేవలస, జడూరు తదితర ప్రాంతాల్లో దాదాపు 250 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 2008కి ముందు ఆయా ప్రాంతాల్లో ఒకటి, రెండు బట్టీలు మాత్రమే ఉండగా ఇప్పుడు బాగా పెరిగాయి. ఇటుకల తయారీలో విజయనగరం జిల్లాకు చెందిన వారితో పాటు ఒడిశాకు చెందిన కూలీలు దిట్ట. వ్యాపారులు వారికి స్థానికంగా వసతి సౌకర్యం కల్పించి ఏటా ఈ సీజన్‌లో ఇటుకలు తయారు చేస్తుంటారు. డిసెంబర్‌లో సీజన్ ప్రారంభమై జూన్‌లో ముగుస్తుంది. వ్యాపారులు పంట భూములు, మెట్టు భూములను లీజుకు తీసుకుని అందులో మట్టిని తీస్తారు. మట్టితో పాటు కొబ్బరి పొట్టు, షామిల్లుల్లో దొరికే కర్ర పొట్టు, బూడిద, ఊకను మట్టిలో కలిపి బాగా ట్రాక్టర్‌తో డ్రిల్లింగ్ చేసి ముద్దగా చేస్తారు. మట్టి నాణ్యతను పరిశీలించిన మీదట అచ్చులు వేస్తారు. అచ్చులు ఎండలో బాగా ఆరబెట్టాక ఒకచోట పెద్దగా బట్టీగా(కోటలా) పెట్టి బొగ్గు, ఊక, కర్రలతో కాలుస్తారు. కాల్చిన ఇటుకలను విక్రయిస్తారు. ఇలా ఇటుకల తయారీకి సుమారు నెల రోజుల సమయం పడుతుంది.



బెండి గేటు ప్రాంతంలో యంత్రాల ద్వారా తయారు చేస్తున్న ఇటుకలు



కొత్తపేటలో జోరుగా జగనన్న కాలనీల నిర్మాణాలు



తేలికవైతే బెటర్



జిల్లాలో 2010కి ముందు బరువుతో కూడిన ఇటుకలు తయారు చేసే వారు. ప్రస్తుతం వాటితో పాటు తేలిక రకం ఇటుకలు కూడా ఎక్కువగా తయారు చేస్తున్నారు. ప్రధానంగా బెండిగేటులో యంత్రాలతో తయారయ్యే ఇటుకల పరిశ్రమ ఉంది. ఇది నాణ్యమైన ఇటుకలకు ప్రసిద్ధి. చిమ్నీ ఏర్పాటు చేసి మరీ ఇటుకలను కాలుస్తారు. ఎనిమిది గంటలు కరెంటు ఉంటే రోజుకు 25వేల ఇటుకలను ఇక్కడ తయారు చేస్తారు. ఈ ఇటుకలు నాణ్యమైనవిగా భావించి ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, పాలకొండ, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చి ఇటుక రూ.5.50 నుంచి రూ.6.50 వరకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇటుకలకు డిమాండ్ పెరుగుతుండడంతో పాటు పెట్టుబడులు కూడా అధికమయ్యాయని నిర్వాహకులు చెబుతున్నారు. బొగ్గు టన్ను గతంలో రూ. 3వేలు ఉండగా ప్రస్తుతం రూ.6వేలు అయ్యింది. ఊక టన్ను రూ.3వేలు నుంచి రూ.5వేలకు పెరిగినట్లు చెబుతున్నారు. జిల్లాలో భూముల ధరలు పెరిగిపోవడంతో భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ప్రస్తుతం ఎకరా పొలంలో మట్టి కొనుగోలు చేసేందుకు రూ.90వేలు వరకు వెచ్చించాల్సి వస్తోందని అంటున్నారు.

నిర్మాణాలు బాగా పెరిగాయి



జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు బాగా పెరిగాయి. కోవిడ్‌కు ముందు చాలా కష్టకాలం నడిచింది. ప్రస్తుతం జగనన్న కాలనీలు, ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలు వేగం కావడంతో ఇటుకల పరిశ్రమ గాడిన పడింది. ఇళ్ల బిల్లులు కూడా ప్రభుత్వం వేగంగా చెల్లించేస్తోంది.
– అనంత రెడ్డి, డీఈఈ గృహ నిర్మాణ శాఖ, పలాస

ఐదేళ్లుగా పనిచేస్తున్నా..



నేను ఐదేళ్లుగా ఇటుకల పరిశ్రమలోనే పని చేస్తున్నాను. మాది ఒడిశాలోని ఝూర్సిగూడ. బెండిగేటుతో పాటు జిల్లాలో మాలా వేల మంది పనిచేస్తున్నారు. ఇదే మాకు ఉపాధి. రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తాం. వానాకాలంలో మా సొంత ఊళ్లకు వెళ్తాం. ప్రస్తుతం రోజుకు 25వేల ఇటుకలు వరకు తయారు చేస్తున్నారు.
– రుషికేశ్వర్, ఇటుకల బట్టీ కార్మికుడు

ఊపుగా ఇళ్ల నిర్మాణాలు..
జిల్లాలో అర్బన్, రూరల్ ఇళ్ల పథకంలో భాగంగా దాదాపు నలభై వేలకు పైచిలుకు ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఊళ్లలో ప్రైవేటుగా నిర్మిస్తున్న ఇళ్లు వీటికి అదనం. వీటికి దాదాపు రూ.50 కోట్ల మేర ఇటుకలు అవసరమవుతాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇటుకలను కొనుగోలు చేసి నిర్మాణాలకు తరలిస్తున్నారు.

అన్నదాతకే ప్రా'ధాన్యం'

- జిల్లాలో మిగిలిన ధాన్యం కొనుగోలుకు సీఎం హామీ
- సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లిన మంత్రి ధర్మాన
- మిగిలిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలిస్తామన్న సీఎం
- సీఎం స్పందనను 'సాక్షి'కి తెలిపిన మంత్రి ధర్మాన



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఖరీఫ్ సీజన్‌లో ఇంకా మిగిలిపోయిన ధాన్యం కొనుగోలు విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు తీసుకెళ్లారు. మిగిలిపోయిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారని సీఎంకు 'ఫోన్'లో వివరించారు. సమస్యను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. జిల్లాలో మిగిలిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆదేశాలిస్తామని మంత్రికి హామీ ఇచ్చారు.

గతమిలా..
గత ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు కావాలంటే క్యూలైన్లలో ఉండి, గొడవలు పడి, లాఠీచార్జీలకు గురై రైతులు ఎన్నో ప్రయాసలు పడ్డారు. ఇక పెట్టుబడి సాయమైతే చేతిలో ఉండేది కాదు. బ్యాంకులు కూడా రుణాల రీషెడ్యూల్ తప్ప కొత్తగా రుణాలిచ్చిన దాఖలాల్లేవు.

ప్రస్తుతమిలా..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు ఎంతో మేలు జరిగింది. నేరుగా ఇంటికే ఎరువులు, విత్తనాలు సరఫరా చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు ఎరువులు, విత్తనాలు అందాయి. క్యూలైన్లు, అగచాట్లకు తావు లేకుండా పోయింది. అవసరం మేరకు రై తులకు సాగు సలహాలు కూ డా సకాలంలో అందాయి. ఇక, సాగునీరు కూడా సకాలంలో అందేలా ప్రభుత్వం చర్య లు తీసుకుంది. అదే విధంగా పెట్టుబడి సాయం కూడా ప్రభు త్వం అందించింది. రైతు భరో సా కింద రూ.13,500 వరకు ప్రతీ రైతుకు అందజేసింది. బ్యాంకు రుణాలు కూడా ఇప్పించింది. రుణాల రీషెడ్యూల్ అనే మాట లేకుండా రైతుకు అవసరమైన పెట్టుబడి సాయం అందేలా చేసింది.

లక్ష్యానికి మించి కొనుగోలు
పంట చేతికొచ్చాక ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, దళారులు, మధ్యవర్తులకు ఆస్కారం లేకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. వీటిన్నింటిపైన రైతులు దాదాపు సంతృప్తిగా ఉన్నారు. కాకపోతే, కొనుగోలు లక్ష్యాల నిర్దేశించడం, దిగుబడి అంచనా వేయడంలో కొంత స్పష్టత లోపించడంతో కొన్ని చోట్ల ఇంకా కొనుగోలుకు నోచుకోని ధాన్యం ఉన్నాయి. వాస్తవంగా గత ఏడాది ఉమ్మడి జిల్లాలోని 38మండలాల్లో 6లక్షల 27వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు జరిగాయి. ఈసారి జిల్లాల పునర్విభజన కారణంగా 30మండలాలకే జిల్లా పరిమితం కావడంతో 4లక్షల 38వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం పెట్టుకోగా సీజన్‌లో ఆ మేరకు కొనుగోళ్లు జరిగిపోయాయి. అయితే, ఈసారి దిగుబడి ఎక్కువగా ఉండటంతో ఇంకా ధాన్యం క్షేత్ర స్థాయిలో ఉండిపోయిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వాస్తవ పరిస్థితుల దృష్ట్యా అదనంగా 40వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇంకా మి గిలి ఉన్నాయని రైతుల నుంచి డిమాండ్ రావడంతో మరో 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇలా 5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసింది. దాదాపు రూ.940 కోట్ల వరకు చెల్లింపులు కూడా చేసింది. ఇంకా రూ. 62 కోట్ల మేర చెల్లించాలి.

మిగిలిన ధాన్యం కొనుగోలు..
జిల్లాలో ఇంకా అక్కడక్కడా ధాన్యం మిగిలి ఉన్నాయని రైతుల్లో ఆందోళన కనబడుతోంది. పారదర్శకంగా కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర అందిస్తున్న క్రమంలో మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలన్న కోరిక వ్యక్తమవుతోంది. వీటిన్నింటిపైన ఆరా తీసి, జిల్లాలో ఇంకా ఎక్కడెక్కడ ధాన్యం మిగిలి ఉండవచ్చని సమాచారం తెలుసుకుని మంత్రి ధర్మాన ప్రసాదరావు నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. రైతులు అన్ని రకాలుగా సంతోషం ఉన్నారని, మిగిలిపోయిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తే వంద శాతం సంతృప్తి చెందడానికి అవకాశం ఉంటుందని సీఎంకు వివరించారు. సమస్యలపై స్పందించే మనసున్న ప్రభుత్వమని చెబుతూ మిగిలిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారులకు తగు ఆదేశాలు ఇస్తామని ఫోన్ సంభాషణలోనే సీఎం హామీ ఇచ్చారు. సాధ్యమైనంత వేగంగా అధికారులకు సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వస్తాయని మంత్రి ధర్మాన 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా

బీసీఏ గుర్తింపు వచ్చిన వెంటనే ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు వచ్చిన వెంటనే ఎల్ఎల్‌బీ మూడేళ్ల తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. వర్సిటీ రిజస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీఏ బృందం వర్చువల్‌గా తనిఖీ పూర్తి చేసిందని, కావాల్సిన డాక్యుమెంట్లు అందజేసినట్లు వివరించారు. అనుమతుల కోసం నిరీక్షిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీలో ఈ నెల 6న ఇంజినీరింగ్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని. ఈ పరీక్షలు ఈ నెల 21వరకు జరగనున్నాయని అన్నారు.

కోళ్ల మృతిపై విచారణ



కోళ్లు శాంపిళ్లు సేకరిస్తున్న వెటర్నరీ ఏడీలు కిశోర్, లోకనాథం

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీలో ఇటీవల 300 కోళ్లు మృతి చెందిన ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ అంశంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. శ్రీకాకుళం వెటర్నరీ ల్యాబ్ ఏడీ కిశోర్, కోటబొమ్మాళి ఏడీ ఎం.లోకనాథం గురువారం విశ్వనాథ పురం వెళ్లి కోళ్ల మృతిపై విచారణ చేపట్టారు. కోళ్ల యజమానులు, కొండాల శిమ్మయ్య, మేడిబోయన అప్పన్నలను కలిసి వివరాలు సేకరించారు. కోళ్ల నుంచి శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగ్న చైతన్య, వెటర్నరీ సహాయకులు కె.మహేష్, ఎస్.శాంతారావు, భానోజీరావు పాల్గొన్నారు.

'అనుభవజ్ఞులకే పనులు అప్పగించండి'



ఎస్ఈ దైవప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ ప్రతినిధులు

అరసవల్లి: కనీస అనుభవం లేని వారికి విద్యుత్ కాంట్రాక్టు పనులను కట్టబెట్టేందుకు టెక్కలి ఈఈ ప్రయత్నిస్తున్నారని, తాజాగా నరసన్నపేటలో ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి పాపారావు, తర్రా ఈశ్వరరావులు కోరారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎల్.దైవ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. టెక్కలి డివిజన్ పరిధిలోని నరసన్నపేట సెక్షన్‌లో ఇటీవల మంజూరైన పెద్ద పనులకు కొందరు షిఫ్ట్ ఆపరేటర్లు కాంట్రాక్టర్ల అవతారమెత్తి పనులు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విషయమై టెక్కలి ఈఈ దృష్టికి కూడా పలుమార్లు తీసుకువెళ్లినా స్పందన రాలేదని కాంట్రాక్టర్ల సంఘ ప్రతినిధులు వివరించారు. కొందరు బినామీలు స్థానిక రాజకీయ నేతల పేర్లు చెప్పి కాంట్రాక్టు పనులకు అగ్రిమెంట్లు చేయించుకుంటున్నారని, ఇందుకు టెక్కలి ఈఈ సహకరిస్తున్నారని, దీనిపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఎస్ఈ దైవప్రసాద్ స్పందిస్తూ విచారించి తగు చర్యలు చేపడతామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమరావతి జేఏసీ ఉద్యమాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన సమయం విరామంలో కలెక్టరేట్ వివిధ సెక్షన్లలో ఉన్న ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

పెద్దల ఎన్నికకు అంతా సిద్ధం

- రెండు స్థానాలకు ఈ నెల 13న పోలింగ్
- ఎన్నికల సిబ్బంది కేటాయింపు, శిక్షణ పూర్తి
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు పోలింగ్ కేంద్రాలు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 59 పోలింగ్ కేంద్రాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల, ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. జిల్లాలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు గాను పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల జరుగుతుండగా, జిల్లాలో స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నిక కూడా జరుగుతోంది. ఈ రెండు ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ఈ నెల 13వ తేదీనే నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఎన్నికలకు సంబంధించి పరిశీలకుడు శ్యామలరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే సిబ్బందిని కేటాయించి, వారికి శిక్షణలు కూడా పూర్తి చేశారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు..

స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వ్యవహరిస్తున్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి వ్యవహరిస్తున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, పాలకొండ, టెక్కలి, పలాసలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓటర్లు 776 మంది మాత్రమే. వీరంతా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పురపాలక సంఘం కౌన్సిలర్లు. శ్రీకాకుళం డివిజన్‌లో 249 ఓటర్లు, పాలకొండ డివిజన్‌లో 153 ఓటర్లు, టెక్కలిలో 162, పలాసలో 212 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున నర్తు రామారావు, స్వతంత్ర్య అభ్యర్థిగా ఆనేపు రామకృష్ణలు పోటీలో ఉన్నారు. ఎన్నికల సామగ్రిని శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉంచారు. పోలింగ్ కోసం పీఓలు 10 మంది, ఓపీఓలు 20 మందిని రిజర్వ్‌తో కలిపి సిద్ధం చేశారు. మైక్రో పరిశీలకులు 8 మందిని నియమించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లాలో సహాయ రిటర్నింగ్ అధికారి ఉంటారు. ఈ స్థానంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 59 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం డివిజన్‌లో 33, టెక్కలి డివిజన్‌లో 12, పలాస డివిజన్‌లో 14 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 52,256 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. వీరిలో శ్రీకాకుళం డివిజన్‌లో 29,631 మంది, టెక్కలి డివిజన్‌లో 11,103 మంది, పలాస డివిజన్‌లో 11522 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓటింగ్‌కి సంబంధించి బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరాయి. ఎన్నికలకు శ్రీకాకుళం డివిజన్‌లో 8 జోన్లు, టెక్కలి డివిజన్‌లో 3 జోన్లు, పలాస డివిజన్‌లో 6 జోన్లను ఏర్పాటు చేశారు. అలాగే శ్రీకాకుళం డివిజన్‌లో 10 రూట్లు, టెక్కలి డివిజన్‌లో 9 రూట్లు, పలాసలో 8 రూట్లను సిద్ధం చేశారు. 75 మంది పీఓలు(రిజర్వ్‌తో కలిపి), 75 మంది ఏపీఓలు, 150 మంది ఓపీఓలను నియమించి శిక్షణ కూడా పూర్తి చేశారు.

పటిష్ట బందోబస్తు..

శ్రీకాకుళం క్రైమ్: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా, జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల రోజున మద్యం అమ్మకాలకు అనుమతి లేదని, పోలింగ్ రోజున కేంద్రానికి వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓటు వేసే వారు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు పత్రాన్ని చూపించాలని సూచించారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ కేంద్రంలోకి వెళ్లకూడదన్నారు. గొడవలకు కారణమైన వారిని ముందుగానే గుర్తించి వారిని బైండోవర్ చేయాలని, కౌన్సిలింగ్ నిర్వహించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు.



జోనల్ అధికారులు, పీఓలకు, ఏపీఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పోలింగ్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. మాన్యువల్‌ను నిశితంగా గమనించి అర్థం చేసుకోవాలని సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఎన్నికలకు సంబంధించి జోనల్ అధికారులు, పీఓలకు, ఏపీఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఏం జరిగినా ప్రిసైడింగ్ ఆఫీసర్‌దే బాధ్యతని స్పష్టం చేశారు. అవసరం అనుకుంటే పోలింగ్‌కేంద్రాల బయట ఉండే పోలీసుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. శ్రీకాకుళం డివిజన్‌కు సంబంధించి శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల, టెక్కలి డివిజన్‌కు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస డివిజన్‌కు సంబంధించి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు. జోనల్ అధికారులు రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం తెలియజేయాలన్నారు. బ్యాలెట్ పేపర్లు మిగిలినవన్నీ లెక్క ప్రకారం తిరిగి అప్పగించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పీఓ డైరీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేయడం, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి సాయంత్రం బాక్సులు సీల్ అయ్యేంత వరకు వీడియో కవరేజ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు గానీ పెన్నులను కానీ అనుమతించరాదన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన మాక్ పోలింగ్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పాల్గొని సీటు సీటుకు వెళ్లి పోలింగ్‌కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రణస్థలం, గార తహసీల్దార్లు జోనల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, కొవ్వాడ ఎస్.డి.సి మురళీకృష్ణ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, డీపీఓ రవికుమార్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకట్రామన్, జోనల్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు



పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



పార్టీలో చేరిన వారితో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: మండలంలోని పెద్దమురహరిపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కాశీబుగ్గలోని ప్రగతి భవన్‌లో వైఎస్సార్‌సీపీ పీఎంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌరకల విశ్వనాథం ఆధ్వర్యంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు టీడీపీ కార్యకర్తలు సైని దానమ్మ, గౌరకల రమణమ్మ, పుత్స రాములమ్మ, గౌరకల చంద్రమ్మ, కేశవరావు, గౌరకల చందరశేఖరరావు, బత్తిని భాస్కరరావు, పి.బైరాగి, గౌరకల రాజులు, మాధవారావు, మల్లేస్‌తో పాటు 50 కుటుంబాలకు చెందిన వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నారని మంత్రి అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ఇన్‌చార్జి జి.విశ్వనాథం, బూత్ కన్వీనర్ కళిశెట్టి నారాయణరావు, సైని ధర్మారావు, బొడ్డు మహలక్ష్మి, పి.ఇసాక్, పి.మహాలక్ష్మి, కె.వెంకటరావు తదితరులు ఉన్నారు.

భరిణికాంలో..

లావేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందపురం పంచాయతీ టీడీపీ మాజీ ఎంపీటీసీ పల్లి సూర్యనారాయణ, టీడీపీ నాయకుల పల్లి వెంకినాయుడు, మజ్జి శ్రీనువాసరావు, లంక చంద్రరావు, కెల్ల ఆదినారాయణ, జాడ సూర్యనారాయణ, కొరగాన లక్ష్మణరావు, పతివాడ రాముతో పాటు భరిణికాం గ్రామానికి చెందిన 60 టీడీపీ కుటుంబాలు గురువారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో భరిణికాం గ్రామంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వం ఇంటింటికీ పథకాలు అందజేసిందని అన్నారు. మన విశాఖను రాజధానిగా ప్రకటిస్తారని తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, జేసీఏ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, గోవిందపురం సర్పంచ్ పిల్లా రాము, ఎంపీటీసీ ఇజ్జాడ రాము, మాజీ ఎంపీటీసీ శటికం రాంబాబు, అదపాక ఎంపీటీసీ గంట్యాడ సత్యం, మహిళా అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు

మానవీయ సాంకేతికత అవసరం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



భూకంపాల నుంచి రక్షణకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలో వివరిస్తున్న విద్యార్థి సాయి

టెక్కలి రూరల్: సాంకేతికత ఎంత పెరిగినా మానవీయత లేకపోతే ఫలితముండదని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. టెక్కలి ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న యాస్పైర్ 2కె 23 సదస్సులో గురువారం ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస జిల్లా పేరును తుడిచివేసేలా సాంకేతిక పరిష్కారాలు చూపేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమను తాము ప్రశ్నించుకుంటేనే ప్రయోగాలు సత్ఫలితాలు ఇస్తాయని హెక్స్‌వేర్ టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఉన్నతాధికారి సొగట్ సేన్ అన్నారు. అలానే ట్రైనీ ఐఏఎస్ లక్ష్మి స్మృతి మాట్లాడుతూ ప్రతి సమస్యకు సాంకేతికత ఓ పరిష్కారం చూపాలని సూచించారు. ఐతమ్ చైర్మన్ డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యా సంస్థను 2001లో ప్రారంభించామని, నేడు ఎన్నో అద్భుత విజయాలు అందుకుంటోందని తెలిపారు. దేశ, విదేశాల్లో పలు ప్రాంతాలకు తమ విద్యార్థులను పంపించి అక్కడ ఉన్న సాంకేతికతను దత్తత చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పాలకొండకు చెందిన సూరబత్తుల సాయిదీపక్ అనే విద్యార్థి భూకంపాలు ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండాలో వివరిస్తూ శభాష్ అనిపించుకున్నాడు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, కో కన్వీనర్ డాక్టర్ పి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు రూ.5లక్షల సాయం

- దానేటి శ్రీధర్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు



రూ.5లక్షల చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ సేవకు చిరునామాగా మారుతున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు డాక్టర్ శ్రీధర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ నిజాయితీ కలిగిన డాక్టర్ ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా వాసులకు అత్యాధునికమైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తపిస్తానన్నారు. తన వద్దకు ఐవీఎఫ్ చికిత్స కోసం వచ్చే వారికి రూ.70వేలు రాయితీతో చికిత్స అందిస్తానన్నారు. అలాగే రిమ్స్‌లో కిడ్నీ బాధితుల చికిత్స కోసం రూ.5లక్షలు చెక్‌ను అందజేశారు. టీబీ రోగుల కోసం రూ.లక్ష ప్రకటించారు. అలాగే తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మెడికవర్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. అదేవిధంగా దానేటి శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు జెమ్స్, న్యూబ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రిలోనే సుమారు 200 మంది ఉచితంగా రక్తదానం చేశారు. అదేవిధంగా నగరంలోని అనాథాశ్రమాలకు రెండు పూటలా ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉల్లి వ్యాపారి దుర్మరణం



రామారావు(ఫైల్)



ఘటన స్థలంలో పడి ఉన్న రామారావు మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని ఒలియాసాగరం గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం చాకిపల్లి గ్రామానికి చెందిన పంగ రామారావు(దండు) (40) అనే ఉల్లిపాయల వ్యాపారి దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామారావు ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటారు. రోజూ ఆటోలో ఉల్లి వేసుకుని ఊరూరా తిరుగుతూ విక్రయిస్తుంటారు. అదే క్రమంలో గురువా రం ఉదయం కూడా వరుసకు అల్లుడైన వాన సింహాచలంతో కలిసి ఆటోలో ఉల్లి వేసుకుని పలాస వైపు బయల్దేరారు. సింహాచలం ఆ టో నడుపుతుండగా రామారావు బండి వెనుక భాగంలో కూర్చుని ఉన్నారు. ఒలియాసాగరం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక భాగంలో కూర్చుని ఉన్న రామారావు తుళ్లి రోడ్డుపై పడిపోగా.. అతడి తలపై నుంచి లారీ వెళ్లిపోయి అక్కడికక్కడే ఊపిరి వదిలేశాడు. ఆటోలో ఉన్న సింహాచలం బయటకు వచ్చి చూసే సరికి రామారావు విగతజీవుడై ఉన్నాడు. ఢీ కొట్టిన లారీ కనిపించలేదు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న టెక్కలి ఏఎస్ఐ వెంకటరమణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఒక్క అద్దం విరిగి ప్రమాద స్థలంలో పడి ఉండటంతో దాని ఆధారంగా ఆ వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవ పంచనామ కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లచ్చమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని పాతనౌపడ గ్రామానికి చెందిన అక్కుదలై దానమ్మ(68) గురువారం ఉరి వేసుకుని మృతి చెందినట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. దానమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. అందులో ఇద్దరు కుమారులు చనిపోయారు.

చిన్న కుమారుడు రమేష్‌తో కలిసి ఆమె గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ఆమెకు ఆరోగ్యం సరిగా ఉండడం లేదు. నిత్యం ఎవరో ఒకరు తోడుగా ఉండాలి. ఈ నేపథ్యంలో కుమారుడు రమేష్ గురువారం బంధువుల ఇంటిలో వివాహానికి వెళ్లాడు. అనంతరం ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు దీన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన సమచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ప్రాణం తీసిన ప్రసాదం వివాదం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి



మృతురాలు బొచ్చు తులసమ్మ

కంచిలి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. స్థానిక ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని చుడాలంజి గ్రామానికి చెందిన తులసమ్మ(26)కు కంచిలి మండలం జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగకు చెందిన బొచ్చు నాగేశ్వరరావుతో 2018 ఏప్రిల్ 27న వివాహం జరిగింది. వీరికి 10 నెలల బాలుడు ఉన్నాడు. నాగేశ్వరరావు కువైట్‌కు ఉపాధి కోసం వెళ్లి రెండేళ్ల కిందట తిరిగి స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. నాగేశ్వరరావు తల్లి పుణ్యవతి మాటలు విని తనను ఇబ్బందులు పెడుతున్నట్లు తులసమ్మ తన తల్లి గాలి డిల్లమ్మకు ఎప్పుటికప్పుడు చెబుతుండేది. ఈ క్రమంలో ఈ నెల 1న జాడుపూడిలో జామి ఎల్లమ్మ యాత్రకు వెళ్లి ప్రసాదం తీసుకొచ్చిన భర్త పొట్లాన్ని తల్లికి ఇవ్వగా మరో పొట్లాన్ని భార్య చేతికి ఇవ్వబోయాడు. ఆ ప్రసాదాన్ని దేవుని ఫొటో వద్ద పెట్టి ఇవ్వమని చెప్పగా అందుకు విరుద్ధంగా నాగేశ్వరరావు ఆ ప్రసాదం పొట్లాన్ని తల్లి పుణ్యవతి చేతికి ఇచ్చాడు. ఈ విషయమై భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. విషయాన్ని తులసమ్మ తన తల్లి డిల్లమ్మకు ఫోన్ చేసి చెప్పింది. ఈ నెల 3న డిల్లమ్మ బంధువులతో కలిసి బసవపుట్టుగ వచ్చి గ్రామపెద్దలతో పంచాయితీ పెట్టింది. తర్వాత ఎవరింటికి వారు వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత తులసమ్మను భర్త నాగేశ్వరరావు, తల్లి పుణ్యవతి తిట్టడంతో మనస్తాపం చెందింది.

తర్వాత రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొంది. గమనించిన భర్త ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. డిల్లమ్మ ఇచ్చి ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.